




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్ లో 500 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము. ఈ టాక్ షోలను విని, వీటిని అక్షరీకరించిన వారు శ్రీ బొడ్డు సత్యనారాయణ(హైదరాబాదు). వారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, ఈ ప్రయోగం కౌముది పాఠకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.

# దుర్గాబాయ్ దేశ్ ముఖ్

## మూడవ భాగం



నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం, నిర్మాణాత్మకమైన సామాజిక సేవకు ప్రత్యక్ష ప్రమాణం, 70 సంవత్సరాల క్రిందటే మహిళా సంక్షేమం గురించి ఆలోచించి.. పథకాలను రూపొందించి వాటికి శాశ్వత రూపం కల్పించి గత డెబ్బై సంవత్సరాలుగా లక్షలాదిమంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపే అనేక సంస్థలకు ఊపిరి పోసిన తెలుగు మహిళా తేజం దుర్గాబాయి దేశ్ ముఖ్ గా అందరికీ తెలిసిన దుర్గాబాయమ్మ గారి స్ఫూర్తి దాయకమైన జీవిత విశేషాలు మూడవ భాగం. పది సంవత్సరాల వయసులోనే స్కూలుకెళ్ళడం మానేసి, పన్నెండు సంవత్సరాల వయసులోనే స్వంతంగా హిందీ బోధనా పాఠశాలను స్థాపించి, పద్నాలుగు సంవత్సరాలకే రాజకీయాల్లో మహామహులతో కలిసి పనిచేసి ఇరవై నాలుగు సంవత్సరాల వయసుకే రాజకీయ జైలు జీవితం గడిపి, ఆ వయసులో చదువుకోవడం ప్రారంభించి ముప్పైరెండు సంవత్సరాలకి క్రిమినల్ లాయర్ గా వృత్తిని ప్రారంభించి ఎక్కడున్నా, ఏంచేస్తున్నా మహిళాభ్యుదయం కోసం నిరంతరము ఆలోచిస్తూ పట్టుదలే పెట్టుబడిగా ధైర్య సాహసాలే చేదోడు

వాదోడుగా వంటరి మహిళగా దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు సాధించిన విజయాలు ఎన్ని తరాలకైనా స్ఫూర్తిదాయకమే. అన్ని వేళల్లోనూ ఆమెకు చేదోడు వాదోడుగా నిలిచిన వాళ్ళమ్మగారు కృష్ణవేణమ్మగారు కూడా దుర్గాబాయమ్మగారి ఆశయ సాధనకి వెన్నుదన్నుగా నిలిచారు. వాళ్ళు స్థాపించిన ఆంధ్రమహిళా సభ వాటి అనుబంధ సంస్థలు అప్పటికి ఇప్పటికి రాబోయే తరాలకి కూడా శాశ్వతంగా నిలిచే నిస్వార్థ సేవా శిఖరాలు. అడుగడుగునా స్ఫూర్తిదాయకం అనిపించే దుర్గాబాయి దేశముఖ్ గారి జీవిత విశేషాలు గత రెండు భాగాల్లో ఏం తెలుసుకున్నామో ఒకసారి క్లుప్తంగా తెలిసికొని తరువాత ఈ వారం విశేషాల్లోకి వెళదాం.

దుర్గాబాయమ్మగారు 1909 లో రాజమండ్రి లో జన్మించారు. కాకినాడలో పెరిగారు. వాళ్ళ నాన్నగారు కాకినాడ కోర్ట్ లో టైపిస్ట్ గా పనిచేస్తూ ఉండేవాళ్ళు. 8 సంవత్సరాల వయసులోనే వివాహమైంది గాని 15 సంవత్సరాల వయసులో వాళ్ళనాన్న గారికి, వివాహం చేసుకున్నాయనకు చెప్పారు "నేను ఈ వివాహబంధం అనే చట్రంలో ఇమడలేను, నా ఆశయం వేరు మీరు కావాలంటే వేరే వివాహం చేసుకోండి" అని ఆయనకు స్పష్టంగా తెలియచేసి, ఆమె వంటరి మహిళగా ఎక్కడున్నా గురించి ఆడవాళ్ళకి ఎలా సహాయంచేయాలి ఆలోచిస్తూ ఆ దిశలో పురోగమించారు. ఇంగ్లీష్ చదువులు నచ్చక 11 ,12 సంవత్సరాల వయసులో స్కూలుకెళ్ళడం మానేసి స్వంతంగా హిందీ నేర్చుకుంటూ నేర్చుకునేటప్పుడే తానుకూడా ఒక పాఠశాలను ప్రారంభించి, అంతేకాకుండా కాకినాడలో జరిగే ఇండియన్ కాంగ్రెస్ శిబిరం లాంటి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. జవహర్ లాల్ నెహ్రు, మహాత్మా గాంధీ లాంటి హేమాహేమీలతో సన్నిహితంగా మెలిగే అవకాశం ఆవిడకి అతిచిన్న వయసులోనే 14 ,15 సంవత్సరాల వయసులోనే కలిగింది. ఆ తర్వాత ఆవిడ 24 సంవత్సరాల వయసులోనే జైలుకెళ్లి 2 సంవత్సరాల పాటు మూడు సార్లుగా ఆవిడ జైలు జీవితాన్ని అనుభవించి, జైలులో మహిళా ఖైదీలను చూసి ఎలాగైనా సరే క్రిమినల్ లాయర్ అవ్వాలి అనుకొని జైలు నుంచి బయటికొచ్చాక అనారోగ్య కారణాలతోటి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడం కంటే చదువుకొని ఒక డిగ్రీ తెచ్చుకొని , క్రిమినల్ లాయర్ కావాలని ఆవిడ వారణాసి బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి మెట్రిక్ పరీక్ష రాసి దానిలో ఉత్తీర్ణురాలై ఆ తర్వాత బెనారస్ లోనే మదన్ మోహన్ మాలవ్యా గారి ఆదరణ తోటి అక్కడ ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఆంధ్రా యూనివర్సిటీ లో పొలిటికల్ ఎం.ఏ.. పూర్తిచేశారు.

ఆ సందర్భంలో వాళ్ళ అమ్మగారు, తమ్ముడుగారు మద్రాసు వెళ్లారు. ఈవిడ విశాఖపట్నంలో చదువుకుంటూ మధ్య మధ్యలో మద్రాస్ వెళ్ళినప్పుడు అక్కడ చుట్టుపక్కలున్నటువంటి పిల్లలందర్నీ చేరదీసి లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ గార్డెన్స్ అని పెట్టి, ఒక చిన్న సంస్థ లాగా ప్రారంభించారు. తర్వాత ఆంధ్రా యూనివర్సిటీ లో చదువు పూర్తి చేసుకొని మద్రాస్ వెళ్లి అక్కడ మద్రాస్ లో లా చదువుతూ ఆ లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే చిన్న సంస్థని కొంచెం కొంచెంగా విస్తరిస్తూ దాన్నొక పెద్ద సంస్థగా తీర్చి దిద్దాలని ఉద్దేశంతో, 1937 ,39 ప్రాంతాల్లో ఆంధ్ర మహిళాసభకి శ్రీకారం చుట్టారు దుర్గాబాయమ్మ గారు. అది భవిష్యత్తులో మహా సౌధం అవుతుందని ఆవిడకి తెలుసు. అంత సంకల్ప బలం తో దాన్ని ప్రారంభించారు. ఆ సంస్థ తరఫున పిల్లలకే కాకుండా మహిళలకి కూడా శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ఇంత వరకూ క్రిందటి భాగాల్లో తెలుసుకున్నాం. ఇక్కడ్నుంచి మిగతా విశేషాలు ఈ భాగంలో తెలుసుకుందాం.

ఈవిడ చేసేటటువంటి నిస్వార్థమైన సేవ చూసి అందరూ విరాళాలివ్వడానికి ముందుకు వచ్చేవాళ్ళు. పిల్లలకి శిక్షణ ఇస్తూ వాళ్ళతో పాటుగా వచ్చిన వాళ్ళ తల్లులకు కూడా ఏమైనా నేర్పితే బాగుంటుందని, ఒక చిన్న వర్క్ షాప్ లాంటిది ప్రారంభిద్దామని అనుకున్నారు. ఐదు వేల రూపాయలు విరాళం అవసరమైంది. సరిగ్గా అదే సమయంలో జైపూర్ మహారాజు విక్రమ్ దేవ్ వర్మ మద్రాస్ రావడం సంభవించినప్పుడు దుర్గాబాయమ్మ గారు ఆ మహారాజు గారిని తీసికెళ్ళి వాళ్ళు చేస్తున్న సంఘసేవా కార్యకలాపాలన్నీ చూపించారు. ఆయన అడక్కుండానే ఐదు వేల రూపాయల చెక్కు రాసి ఇచ్చారు. ఐదు వేల రూపాయలతోట దుర్గాబాయమ్మ గారు ఒక వర్క్ షాప్ ప్రారంభించి అక్కడికి వస్తున్న ఆడవాళ్ళకి – నూలు వడకడం, పేపర్ తో బుట్టలు తయారు చేయడం లాంటి చేతి వృత్తుల్లాగా ప్రారంభించారు. సంస్థకి కొంత ఆదాయం వచ్చేది. అందులో పనిచేసే ఆడవాళ్ళకు కూడా రోజుకి రెండు రూపాయలో, మూడు రూపాయలో ఇచ్చి స్వయంపోషకత్వం కలిగించడం, సంస్థకు కూడా ఆర్థికంగా వెన్నుదన్ను రావడం ఇవన్నీ కూడా ఆవిడ మనసులోంచి పుట్టినటువంటి ప్రణాళికలు. ఆవిడలో ఉన్న నాయకత్వ లక్షణాలు – అందర్నీ దగ్గరకు తీసుకురావడం, అందరి దగ్గర్నుంచి విరాళాలు తీసుకురావడం వీటన్నిటికీ సహకరించాయి. ఆవిడ ప్రారంభించినటువంటి ఆంధ్రమహిళాసభ లో ఆశ్రయం పొంది జీవితాన్ని ఒక దోవలో పెట్టుకున్నవాళ్ళ

లో ముళ్ళపూడి వెంకటరమణ గారి అమ్మగారు కూడా ఉన్నారు. ఆవిడ కూడా అదే రోజుల్లో మద్రాస్ వెళ్లి దుర్గాబాయమ్మ గారి ఆంధ్రమహిళాసభలో ఆవిడ విస్తరాకులు కుట్టి అమ్మడం చేస్తూ ఉండేవాళ్ళు.

అందులో పనిచేసే వాళ్ళు స్థిరపడాలంటే వాళ్లకి దూర దృష్టితోటి ఏమైనా శాశ్వతం ఉపాధి కలిగే అవకాశాలుండాలి అని ఆలోచించి దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు వాళ్లకి విద్య నేర్పాలి అనుకున్నారు. ఎందుకంటే ఎక్కువ మంది ఆవిడ దగ్గరికి వచ్చే వాళ్ళల్లో భర్త నిరాదరణకు గురైన వాళ్ళు , చదువుకొని వాళ్ళు అలాగే వితంతువులు ,బాలవితంతువులు ఇలాంటి వాళ్ళు ఎక్కువగా ఉండేవాళ్ళు. వాళ్ళు సాధారణంగా నాలుగోతరగతి , ఐదోతరగతి మించి చదువుకున్నవాళ్ళు అయివుండేవాళ్లు కాదు. వాళ్లకి చదువు నేర్పించి, మెట్రిక్ పరీక్ష రాయించి, తర్వాత కాలేజీలో చేర్పిస్తే వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేటటువంటి ఉద్యోగాలు తెచ్చుకొనే అర్హత వస్తుంది అనే ఆలోచనతో దుర్గాబాయమ్మ గారు, అక్కడికి వచ్చిన తల్లులందరికి ఆవిడ చదువు చెప్పేటటువంటి శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. మనం గమనించాల్సింది, ఆ సమయంలో ఆవిడ ఇంకా చదువుకుంటూ ఉన్నారు. అలా చదువుతూనే ఈ పనులన్నీ చేశారు.

వాళ్ళకు అర్హత పరీక్ష కి కావాల్సినటువంటి శిక్షణ అంతా ఇప్పించే క్రమంలో, నళినీకాంతరావుగారు అని ఒకాయన్ని ఉద్యోగంలోకి తీసుకుని ఆయనకీ బాధ్యత అప్పజెప్పారు. ఇంకా. ఆయన ఏడెనిమిది నెలల్లో అక్కడికి వచ్చినటువంటి ఆడవాళ్లందరికి కూడా మెట్రిక్ పరీక్ష కి శిక్షణ ఇచ్చారు. మొత్తం ఇరవై మందో, పాతిక మందో ఆడవాళ్లు ఉన్నారు ఆ శిక్షణ తీసుకున్న వాళ్లలో. ఆ శిక్షణ అయిపోయి వాళ్ళు బెనారస్ లో పరీక్ష రాయడానికి సిద్ధమయ్యేది 1942 ప్రాంతాల్లో. సరిగ్గా అప్పటికే దుర్గాబాయమ్మ గారు క్రిమినల్ లాయర్ కూడా పూర్తి చేసుకొని, బార్ లో రిజిస్ట్రేషన్ చేయించుకొని కోర్ట్ కి వెళ్లాల్సినటువంటి రోజు వచ్చింది. సరిగా ఆ సమయంలోనే ఈ ఆడవాళ్లందరినీ కూడా బెనారస్ తీసికెళ్ళాలి.

1942 అంటే రెండవ ప్రపంచ యుద్ధం ముమ్మరంగా సాగుతోంది. ఆ రోజుల్లో భారతదేశమంతాకూడా యుద్ధ నీడలు వ్యాపించి ఎక్కడ బాంబులు పడతాయో , ఎక్కడ ఈ వంతెనలు కూలిపోతాయో ఏ బిల్డింగుల మీద పడతాయో అని అందరూ ం చాలా భయంభయంగా జీవిస్తున్న రోజులు. ఆ రోజుల్లో మరి ఈ పాతికమంది ఆడపిల్లల్ని తీసికొని బెనారస్ తీసికెళ్ళి పరీక్ష రాయించాలంటే ఎవరు ముందుకొస్తారు? ఆ పాతిక మందిలో చాలా మంది తల్లిదండ్రులు కూడా వాళ్ళను పంపించడానికి ఒప్పుకోలేదు. కొంతమంది జారుకున్నారు. మొత్తానికి 18 మంది ఆడపిల్లలు మిగిలారు. దుర్గాబాయమ్మ గారు "ఎవరూ తోడు రాకపోయినా ఫరవాలేదు నేనే తీసికెళతాను వీళ్ళని" అని ఆవిడ బార్ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన రోజును కూడా వాయిదా వేసికొని ఈ 18 మంది ఆడపిల్లల్ని తీసికొని – ఆవిడ, నళినీకాంతరావు అన్నాయన ఇద్దరూ కలిసి బెనారస్ బయల్దేరారు.

అప్పట్లో ఒకే రైలు ఉండేది కాదు మద్రాసు నుంచి వారణాసి వెళ్ళడానికి. ఇటార్సీ లో దిగి ఒక పది పన్నెండు గంటలు వేచిచూసి అక్కడ్నుంచి బెనారస్ వెళ్ళే రైలు ఇంకోటి ఎక్కాలి. ఈ 18 మంది ఆడపిల్లల్ని తీసికొని దుర్గాబాయమ్మగారు, నళినీకాంతరావు గారు ఇటార్సీ లో దిగారు. రాత్రి తొమ్మిదో. పదో అయింది. మర్నాడు పొద్దున్న ఎనిమిది గంటల వరకు మళ్ళీ బెనారస్ వెళ్ళే రైలు లేదు. ఎక్కడుండాలి? ఆ దగ్గర్లో ఏదో కొంచెం తక్కువ ఖరీదులో ఉన్నటువంటి హోటల్ చూసుకొని, నాలుగైదు రూములు తీసికొని ఈ ఆడపిల్లలందర్నీ అక్కడికి తీసుకెళ్ళారు. వాళ్ళందరిని క్షేమంగాచూసే బాధ్యత ఆవిడ భజస్కందాలపై వేసుకున్నారు. అప్పటికావిడ వయసు 33 సంవత్సరాలు.

ఆ హోటల్ లో వీళ్ళందరూ ఉన్నప్పుడు అర్ధరాత్రి పూట దొంగలొచ్చారు. తలుపులు పగులగొట్టి వీళ్ళ సూట్ కేసులెత్తుకెళ్ళడం ప్రారంభించారు. దుర్గాబాయమ్మ గారు, నళినీకాంతరావు గారు లేచి ఆ దొంగల వెనకాల పడి వాళ్ళదగ్గరితో పోరాడి ఎట్లాగో ఆ సూట్ కేసులు వెనక్కి లాక్కొచ్చారు. .ఆ క్రమంలో వాళ్లకు కూడా ఒంటినిండా గాయాలయ్యాయి. కాళ్ళూ చేతులు గీరుకు పోయాయి. అయినా గాని పట్టువదలకుండా మొత్తానికి ఆ దొంగల్ని తరిమేసి, ఆడ పిల్లల్ని భయపడొద్దని చెప్పి తెల్లవార్లూ వాళ్ళతో కూర్చుని పొద్దునే ఎనిమిదింటికి బయల్దేరి మళ్ళీ ఆ బెనారస్ రైలెక్కి వెళ్లారు.

బెనారస్ లో, 18 మంది ఆడపిల్లల్ని పెట్టుకొని ఎక్కడుంటారు వీళ్ళు? అప్పటికే మరి దుర్గాబాయమ్మ గారికి రాజకీయాల్లో చాలా పేరు వుంది. రాజకీయనాయకులు చాలామంది తెలుసు. ఎవరిదగ్గరికైనా సరే ధైర్యంగా చొరవగా వెళ్లగలిగేటటువంటి తెగువ ఉంది. అక్కడ బెనారస్ లో విజయనగరం మహారాజు గారి అబ్బాయి ఒకాయన ఉన్నారు. యువరాజు. ఆయన పేరు విజ్జి. ఆయన క్రికెట్ లో కూడా చాలా పేరుతెచ్చుకొని క్రికెట్ టీంస్ ని కూడా తీసికెళ్ళి బెనారస్ లో ఆయన స్వంతంగా అక్కడున్నటువంటి ఆయన పాలస్ లో ఆడిస్తూ ఉండేవాళ్ళు. ఆ విజయనగరం మహారాజు గారి దగ్గరకెళ్ళి , వాళ్ళ పాలస్ లో ఈ 18 మందికిని ఉండడానికనివాళ్ళను అభ్యర్థించి , వాళ్ళతో ఒప్పించి అక్కడ పెట్టి వాళ్ళతోటి పరీక్ష రాయించారు.

వెనక్కొచ్చాక బార్ లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

మెట్రిక్ పాసైనవాళ్ళందరూ తర్వాత ఇంటర్మీడియట్ లో చేరాలి. మద్రాస్ లో అన్ని చోట్ల అప్లికేషన్ లు పెట్టుకున్నారు. మద్రాస్ యూనివర్సిటీ వాళ్ళు అప్పుడు ఒక అభ్యంతరం లేవదీశారు. "ఇందులో రాసినవాళ్ళందరూ కూడా మొత్తం వాళ్ళు పన్నెండు సంవత్సరాలు చదువుకోలేదు చివర్లో ఈ ఆర్నెల్లు చదువుకొని పరీక్షలు రాశారు. ఇలా వచ్చిన కాండిడేట్స్ అయితే గనక మేము ఇంటర్మీడియట్ లో చేర్చుకోము" అని. ఆవిడ వెంటనే బెనారస్ హిందూ యూనివర్సిటీ కి రాసి, అక్కడ్నుంచి ఉత్తరాలు తెప్పించి ఆ ఉత్తరాలనన్నిటిని మద్రాస్ యూనివర్సిటీ కి పంపించి , మద్రాస్ యూనివర్సిటీ వాళ్ళు ఇంకేవో అభ్యంతరాలుంటే వాటిని మళ్ళీ అక్కడికి రాయించి.. మొత్తానికి ఎలాగైతే మద్రాస్ యూనివర్సిటీ వాళ్ళని ఒప్పించారు.

అప్పుడు ఆవిడకు ఓ ఆలోచన వచ్చింది. "ఔను ఈ సంవత్సరము వీళ్ళతో ఇంతగా పోట్లాడవలసి వచ్చింది . అసలు ఇలా ఎందుక్కావాలి?ఈ సమస్యని పరిష్కరించడానికి ఇంటర్మీడియట్ కూడా నేనే పెడితే బావుంటుంది కదా" అనుకొని, దానిక్కావల్సినటువంటి అనుమతులన్నీ తెచ్చుకొని ఆంధ్రమహిళా సభ లోనే ఇంటర్మీడియట్ కోర్స్ కూడా ప్రారంభించారు. ఆవిడకు ఎప్పుడు సవాలు ఎదురైనా, ఎప్పుడు సమస్య వచ్చినా ఆ సమస్యని, సవాల్నిఆవిడ చాలా ఛాలెంజింగ్ గా తీసికొని దాన్నొక నిర్మాణాత్మకమైనటువంటి పథకంగా మలచడం ఆమె బలం. ఇంటర్మీడియట్ చదువు ఎవరు చెబుతారు? పూర్తికాలం ఉపన్యాసకులు కావాలంటే ఎక్కువ జీతం ఇవ్వాలి. అప్పటికే విరాళాలతోటి నడుస్తున్న సంస్థ . అందుకని ఆ మద్రాస్ యూనివర్సిటీ లోనే రీసెర్చ్ స్కాలర్స్ గా పనిచేస్తున్న వాళ్ళు అనంతరావు బాజీ , యస్.కె. రావు ,ఏకాంబరం, కమలాపతి, ఇలాంటి కొంతమంది కుర్రవాళ్ళని తీసికొని వాళ్లకి "మీరెలాగూ రీసెర్చ్ చేస్తున్నారు. మీకు రీసర్చ్ కి ఎంత అవసరమైనటువంటి డబ్బులు అంతా నేను ఇస్తాను పూర్తి జీతమైతే నేనివ్వలేను. ఇదిగో మా పిల్లలందరికీ ఇంటర్మీడియట్ కోచింగ్ ఇవ్వండి" అని చెప్పారు.

ఇలా దుర్గాబాయమ్మ గారు ఈ వర్క్ షాప్ లు చేయించి కొంత డబ్బులిస్తున్నారని, మేట్రిక్కు, ఇంటర్మీడియట్ కూడా శిక్షణ ఇస్తున్నారని తెలిసి మద్రాస్ చుట్టుపక్కల ఉన్నవాళ్ళందరూ రావడం ప్రారంభించారు. మాధవ్ బాగ్ అనేటటువంటి వూళ్ళో ఒక అర డజన్ మందో, ఎనిమిది మందో ఆడపిల్లలంటే,వాళ్ళతోటి లేడీస్ హాస్టల్ కూడా ప్రారంభించారు. దానికి జమునాబాయి అనే ఆవిడ వాలంటీర్ గా కూడా ఉన్నారు.

చూడండి ఎన్నిచేశారో! మూడు సంవత్సరాల్లో.ఈ మెట్రిక్ పరీక్ష ప్రారంభించడం,ఇంటర్మీడియట్ ప్రారంభించడం,తర్వాత వర్క్ షాప్ ఆ తర్వాత హాస్టల్ .ఇలా ఒకదాని తర్వాత ఒకటిగా దాన్ని విస్తరించుకుంటూ వెళ్లారు. అన్నీ దాతల విరాళాల తో నడుస్తోంది అప్పటివరకు కూడాను. ఆంధ్రమహిళాసభకి ఎక్కువ ప్రాచుర్యం రావడానికి– వాళ్ళ తమ్ముడు నారాయణరావు ఏంచెప్పారంటే "మనం ఒక పత్రిక పెడదాము. పత్రిక ద్వారా మన సంస్థయొక్క కార్యకలాపాలన్నీ కూడా అందరికి త్వరగా చేరతాయి" అని. అలా 'ఆంధ్రమహిళ' అనే పత్రికని ప్రారంభించారు 1942 ,43 ప్రాంతాల్లో. దాన్ని ప్రింట్ చేయించుకోడానికి కూడా వేరే చోట ఎక్కువవుతుందని వాళ్ళే స్వంతంగా అచ్చు యంత్రాన్ని కూడా సమకూర్చుకుని ఆ పత్రికని ముద్రించడం ప్రారంభించారు. కొంతకాలం ఆ పత్రిక నడిచింది. తర్వాత అది పూర్తిగా తెలుగులో ఉంటె అందరికిఅర్ధం కావటం లేదని 'విజయదుర్గ' అని పేరు మార్చి ఇంగ్లీష్ లోను, తెలుగు లోను ఉండేలాగా కొంతకాలం కొనసాగించారు.

ఇదంతాకూడా ఆవిడ మరి పూర్తికాలం చెయ్యలేదు. వాళ్ళమ్మగారు , వాళ్ళ మరదలు గారు చూస్తున్నారు. వాళ్ళ తమ్ముడు కొంత సహాయం చేస్తున్నాడు. ఇంకా స్వచ్ఛంద సేవకులు కొంతమంది కూడా,

అతి కొద్ది సమయంలోనే ఆమె క్రిమినల్ లాయర్ గా కూడా ఆవిడ ఖ్యాతి కూడా తెచ్చుకున్నారు. 1946 వచ్చేసరికి ఆవిడకి ఇంకా ఈ అద్దెభవనాల్లో ఎక్కువ కాలం కొనసాగడం కష్టం అని ప్రణాళికలు మొదలుపెట్టారు. 1946 లో మహాత్మా గాంధీ గారిని పిలిపించి ఆయన తో ఆంధ్రమహిళాసభ శాశ్వత భవనానికి పునాది వేశారు.

ఆవిడ జాతీయ స్థాయిలో ఢిల్లీ కి కూడా వెళ్లి ఆ ఢిల్లీ రాజకీయాల్లో కూడా ఆవిడ చురుకుగా పాల్గొనేటటువంటి అవకాశం 1946 లో వచ్చింది. దుర్గాబాయమ్మ గారి జీవితం తిరిగిన ఈ మలుపు గురించి మాట్లాడుకోవడానికి అప్పట్లో ఉన్న భారతీయ రాజకీయ పరిస్థితు లేమిటో ఒకటి రెండు వాక్యాల్లో తెలుసుకుందాం. అప్పటికే బ్రిటీష్ వాళ్ళు భారతదేశం ఈ రాజకీయ నాయకులకి, కాంగ్రెస్ నాయకులకి చెప్పేశారు "మీకు స్వాతంత్ర్యం ఇచ్చేస్తాం, మీరు రాజ్యాంగాన్ని నిర్మించుకోవడం ప్రారంభించండి" అని. అప్పటివరకు కూడా నామమాత్ర సంస్థగా ఉన్నటువంటి కాన్స్టిట్యూయెంట్ అసెంబ్లీ కి కొంచెం పరిమితమైనటువంటి ఓట్ల ద్వారా ఎన్నిక నిర్వహించి కొంతమంది సభ్యుల్ని ఎన్నుకున్నారు. రెండువందల తొంబై మందినో , మూడు వందల మందినో.

ఆ ఎన్నుకున్న వాళ్ళల్లో కాంగ్రెస్ పార్టీ తరఫు నుంచి దుర్గాబాయమ్మ గారిని కూడా ఒక సభ్యురాలిగా ఎన్నుకున్నారు. అక్కడినుంచి దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు పనిచేసేటటువంటి కార్యక్షేత్రము మద్రాస్ నుంచి ఢిల్లీకి మారింది. ఆవిడకి అక్కడ ఒక క్వార్టర్ ఇచ్చారు. మద్రాస్ లో మామూలుగా ఉంటూ ఈ కాన్స్టిట్యూయెంట్ అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పుడు ఢిల్లీ వెళ్లడం , ఆవిడ క్వార్టర్ లో ఉండడం అలాగే ఆవిడ ఎలాగూ ఢిల్లీ వెళ్తున్నారుకాబట్టి సుప్రీమ్ కోర్ట్ లో కూడా ఆవిడ క్రిమినల్ లాయర్ గా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఢిల్లీలో ఉండగానే పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్, గోపాల్ స్వామి అయ్యంగార్, బి.ఆర్ అంబెడ్కర్ ఇలాంటి వాళ్లందరితో కూడా కలిసి పనిచేశారు.

ఈవిడకొక ప్రత్యేకమైనటువంటి కార్యక్రమం ఏమిచ్చారంటే కాన్స్టిట్యూయెంట్ అసెంబ్లీ లో రాజ్యాంగానికి వీళ్ళనుకున్నటువంటి సూత్రాలు ఇవన్నీ రాస్తున్నపుడు వాటికి కొన్ని సవరణలు కూడా ప్రతిపాదిస్తూ ఉంటారు కొంతమంది . వాటన్నిటినీకూడా ఒక జాబితా లాగా పెట్టి ఆ తర్వాత సమావేశంలో వాటిని చర్చకు తీసుకురావడం, ఆ చర్చ సజావుగా సాగేలా చూడడం – ఆ బాధ్యతని దుర్గాబాయమ్మ గారికి అప్పగించారు.

కాన్స్టిట్యూయెంట్ అసెంబ్లీ ఈ సమావేశాల్లో కూడా దుర్గాబాయమ్మ గారు చాలా ధైర్యంగా మాట్లాడుతూ ఉండేవాళ్ళు. రాజ్యాంగ నిర్మాణంలో కూడా ఈవిడ చురుగ్గా పాల్గొంటూ రెండు చోట్ల ప్రాక్టీస్ చేస్తూ ఉండగా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చాక ఈ కాన్స్టిట్యూయెంట్ అసెంబ్లీ నే ప్రొవిజనల్ పార్లమెంట్ అన్నారు. అది 1951 చివరివరకూ కొనసాగింది. అందువల్ల దాన్లో కూడా దుర్గాబాయమ్మ గారు ఒక సభ్యురాలిగా కొనసాగారు. సర్దార్ వల్లభ్ భాయి పటేల్ గారు డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ గానూ , హోమ్ మినిస్టర్ గానూ ఉన్న రోజుల్లో దుర్గాబాయమ్మ గారు ఢిల్లీ లో ఉన్నటు తెలుగు వాళ్లందరికీ ఒక స్కూలు,ఒక భవనం ఉంటే బాగుంటుంది అనుకొని, ఆయన తో చెప్పి ఢిల్లీ లో తెలుగు సంఘానికి కావాల్సినటువంటి భవనానికి కావాల్సిన ధనాన్ని కూడా ఆవిడ సేకరించారు.

ఆవిడ ఎక్కడున్నా, ఏంచేస్తున్నా సమాజ సేవ ఎలా చేయాలి , పదిమందికి ఉపయోగపడే పని ఎలా చేయాలి ఇదే ఆలోచిస్తూ ఉండేవాళ్ళు., దానికి కార్యరూపం ఇస్తూ ఉండేవాళ్ళు. దానికి మరో ఉదాహరణే ఇది. సర్దార్ వల్లభ్ భాయి పటేల్ గారు ఆమెను ఎంతగా గౌరవించేవాళ్ళంటే – సుప్రీమ్ కోర్ట్ లో లైబ్రరీ కి, పుస్తకాలకి యాభై వేలు కేటాయించారు. ఐతే దానికి ఇంకో యాభై వేలన్నా కావాలి.వాళ్లకు సర్దార్ వల్లభ్ భాయి పటేల్ గారిని అడగడానికి భయం.అందుకని దుర్గాబాయమ్మ గారి తో చెప్పారు. ఆవిడ చెప్పగానే సర్దార్ వల్లభ్ భాయి పటేల్ గారు “నాకు తెలుసమ్మా మీరెప్పుడూ మీకోసం అడగరు.పరాయివాళ్ళకోసమే మీరు సహాయం అడుగుతారు తప్పని సరిగా ఇస్తాను” అని ఆయన ఇంకో యాభై వేలిచ్చి లక్ష రూపాయలతోటి సుప్రీమ్ కోర్ట్ లో లైబ్రరీ పెరగడానికి కూడా దుర్గాబాయమ్మ గారు సహాయం చేశారు.

ఈ విధంగా 1950 వ సంవత్సరం వచ్చింది. ఈ మధ్యలో జరిగిన ఓ సంఘటన – ఒకసారి ఆవిడ బొంబాయి వెళ్లారు, యేవో కేసులు క్రిమినల్ కేసులు వాదించడానికి. ఆ సందర్భంలో అక్కడ ఒక ముఖ్యమైన వ్యక్తిని కలుసుకుందామనుకున్నారు.ఆయన పేరు చింతామన్ ద్వారకానాథ్ దేశ్ ముఖ్ ( సి.డి.దేశ్ ముఖ్) ఆయన 1950 కి ఆయన రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా గవర్నర్ గా పనిచేస్తూ ఉన్నారు. ఆ పదవిలోని మొట్టమొదటి భారతీయుడు ఈ సి.డి.దేశ్ ముఖ్ గారు. ఆఫీసు వాళ్లడిగారు “ఎందుకు కలవాలనుకుంటున్నారు?” అంటే “ఏమీ లేదు. ఆయన చాలా నిజాయితీగా పని చేస్తున్నారు అని తెలిసింది. అభినందనలు తెలియజేద్దామని అనుకుంటున్నాను” అని చెప్పారు. ఆఫీస్ వాళ్ళు చెప్పారు “ ఏదో ఒక పని ఉంటే తప్ప మామూలుగా ఆయన మామూలు విజిటర్స్ ని కలవరు” అని ఆవిడ్ని పంపించేశారు. ఆ విధంగా ఆవిడ ఎవరి ఇంటర్వ్యూ అయితే తీసికొని అభినందిద్దామని అనుకున్నారో ఆయన్ని కలువకుండా, వెనక్కి తిరిగిన మరో రెండు సంవత్సరాల్లో ఆయనే ఆవిడ జీవిత భాగస్వామి అవుతాడని ఆవిడకి ఏమాత్రం ఊహలేదు. ఆవిడ్ని కలువలేకపోయిన సి.డి.దేశ్ ముఖ్ గారికి కూడా తనని కలవడానికి ఒక అమ్మాయొచ్చిందని అతడికి కూడా తెలియదు.

1950 లో రాజ్యాంగ నిర్మాణం కూడా పూర్తయిపోయాక ఈ ప్రొవిజనల్ పార్లమెంట్ కొనసాగుతున్నప్పుడు ప్రధానమంత్రిగా మన జవహర్ లాల్ నెహ్రూగారున్నారు. మత్తయ్య గారని ఆయన ఫైనాన్స్ మినిస్టర్ గా ఉన్నారు. అప్పుడు జవహర్ లాల్ నెహ్రూ గారికి ఓ ఆలోచన ఏమొచ్చిందంటే, ప్లానింగ్ కమిషన్ అనేటటువంటి ఒక సంస్థని పెట్టి పంచవర్షప్రణాళికలు రూపొందించి ఈ భారతదేశంలో రాబోయే ఐదు సంవత్సరాల్లో ఈ ప్లానింగ్ అంతా ఎలా చేయాలి వివిధ సంస్థల్ని కూడా ఎలాగా విస్తరించాలి , వచ్చినటువంటి ధనాన్నంతటిని కూడా ఎలా పంచాలి అనే కార్యక్రమాలకు రూపకల్పన చెయ్యాలనుకున్నారు. .అయితే మత్తయ్య గారికి ప్లానింగ్ కమిషన్ పెట్టడం ఇష్టం లేదు. ఎందుకంటే, ఈ ఫైనాన్స్ మినిస్టర్ యొక్క బాధ్యతలన్నీ కూడా దీనికెక్కువగా వెళ్లిపోతాయి. అందుకని ఆయన రిజైన్ చేశారు.

అలా మత్తయ్యగారు వెళ్ళిపోయాక సి.డి.దేశ్ ముఖ్ గారిని ఫైనాన్స్ మినిస్టర్ గా తీసుకొచ్చారు. ఆ విధంగా ఫైనాన్స్ మినిస్టర్ గా సి.డి.దేశ్ ముఖ్ గారున్నప్పుడు, ప్రొవిజనల్ పార్లమెంట్ మెంబర్ గా దుర్గాబాయమ్మ గారు కూడా కొనసాగారు. ఆవిడ ఎప్పుడో చూడాలనుకున్న సి.డి.దేశ్ ముఖ్ గారిని చూసేటటువంటి అవకాశం, కలిసి పనిచేసేటటువంటి అవకాశం కూడా వచ్చింది. ఆయన పార్లమెంట్ లో బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పుడు ఈవిడ తీవ్రంగా విమర్శించారు. "ఇది ధనవంతులకు సహాయం చేసేటట్టుంది. పేద వాళ్ళకి సహాయం చేసేటట్టు లేదు" అని. సి.డి.దేశ్ ముఖ్ గారు మొట్టమొదటి సారిగా దుర్గాబాయమ్మ గారిని అప్పుడు చూశారు. "ఎవరు ఈ అమ్మాయి ఇంత ధారాళంగా హిందీ లో మాట్లాడుతుంది? , ధైర్యంగా మాట్లాడుతుంది" అనుకుంటూ ఆయన కూడా కొంచెం సూక్ష్మంగా పరిశీలించడం ప్రారంభించారు. ఈవిడ పార్లమెంట్ మెంబర్ గా, ఆయన ఫైనాన్స్ మినిస్టర్ గా ఒక సంవత్సరం కొనసాగారు.

1951 చివర వచ్చేసరికి ప్రొవిజనల్ పార్లమెంట్ అయిపోయి మళ్ళీ సార్వత్రిక ఎన్నికలు మొదలయ్యాయి. ఆ ఎన్నికలు అన్నీకూడా ఒక్కసారి జరుగలేదు. 51 చివరినుంచి, 52 మధ్య వరకు రెండు మూడు దఫాలు గా జరిగాయి. ఆ ఎన్నికల్లో దుర్గాబాయమ్మ గారిని నెహ్రూ గారు రాజమండ్రి లో పోటీ చేయించారు. దురదృష్ట వశాత్తూ, ఆ ఎన్నికల్లో దుర్గాబాయమ్మ గారు ఓడిపోయారు. కమ్యూనిస్ట్ అభ్యర్థులు గెలిచారు.

1952లో ఆవిడ మళ్ళీ చెప్పారు నెహ్రూ గారికి "ఇంక ఈ రాజకీయాల్లో నేను విరమించుకుంటానండి అక్కడ మద్రాసులో చూసుకోవాల్సినటువంటి ఆంధ్ర మహిళాసభ , దాన్ని పెంచడం ఇవన్నీ కూడా ఉన్నాయి నేను వెళతాను" అని. .అయితే నెహ్రూ గారు మాత్రం దుర్గాబాయమ్మ గారి సేవల్ని వదులుకోవడం ఇష్టం లేక "లేదమ్మా నీవు వెళ్ళడానికి వీల్లేదు.. ఓ పనిచెయ్యి నీకు కొన్ని కార్యక్రమాలప్పగిస్తాను ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన నీవు రాజకీయాలనుంచి విరమించుకోవలసిన పని లేదు. రాయలసీమ లో కరవు ప్రాంతాల్లో ఎక్కువగా బాధపడుతున్నవి, ఇదిగో నేను కొంత బడ్జెట్ ఇస్తాను ఈ బడ్జెట్ తీసికెళ్ళి రాయలసీమ కరవు ప్రాంతాల్లో నీవు సహాయకార్యక్రమాలు నిర్వహించు" అని కొంత బడ్జెట్ ఇచ్చారు.అది తీసికొని ఆవిడ రాయలసీమ ప్రాంతంలో ఆ కరవునివారణ చర్యలన్నీ చేపట్టారు.

అదయ్యాక మళ్ళీ నెహ్రూ గారికి చెప్పారు "ఏమండి మీరిచ్చినటువంటి పని అయిపోయింది ఇక నేను వెళ్తాను మద్రాస్" అని . ఆయన మళ్ళీ వదిలిపెట్టలేదు.ఈసారి ఏమన్నారంటే, "చైనా, అలాగే రష్యా మిగతా విదేశాలకి కొన్నిటికి వెళ్ళి అక్కడ ఫామిలీ కోర్ట్ లు ఎలా పనిచేస్తున్నాయో నువ్వు చూసి రా దాన్ని బట్టి మనం ఇండియా లో కూడా ఫామిలీ కోర్ట్ లు ప్రారంభిస్తే బావుంటుంది" అని ఆవిడని విదేశాలకి పంపించారు. .విదేశాలకి వెళ్లొచ్చి మళ్ళీ చెప్పారు "మీరు పంపించినటువంటి బాధ్యత ఐపోయిందండి. మద్రాస్ వెళ్ళిపోయి నా సంస్థ ను చూసుకుంటాను" అని.

ఆయన వదిలిపెట్టలేదు. "మిమ్మల్ని ప్లానింగ్ కమిషన్ లో ఒక సభ్యురాలిగా వేద్దామని చెప్పి ఒక సూచనొచ్చింది" అని. ప్లానింగ్ కమిషన్ అనేది 1950 లోనే మొదలైంది. దానికి కూడా మెంబర్ గా సి.డి.దేశ్ ముఖ్ గారున్నారు.ఆయన ఫైనాన్స్ మినిస్టర్ గా పనిచేస్తూ ప్లానింగ్ కమిషన్ మెంబర్ గా కూడా ఉన్నారు.ఆ రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్లానింగ్ కమిషన్ లో మరొక సభ్యురాలిగా ఈ దుర్గాబాయమ్మ గారిని చేర్చుకుందామని అనుకున్నారు. దుర్గాబాయమ్మ గారిని ప్లానింగ్ కమిషన్ లో చేర్చుకోమని సి.డి.దేశ్ ముఖ్ గారే చెప్పారు.

ఇంకావిడ కాదనలేక పోయింది.ఎందుకంటే, ఈ ప్లానింగ్ కమిషన్ లో ఉంటే గనక ఈ మహిళాభ్యుదయానికి సంబంధించినటువంటి కార్యక్రమాలు అవి ఎక్కువగా చేపట్టడానికి వీలౌతుంది అనే ఉద్దేశంతో ఆవిడ ఢిల్లీ లోనే కొనసాగారు. ఆ విధంగా 1952 లో దుర్గాబాయమ్మ గారు ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా వెళ్లారు.అక్కడ ప్రత్యక్షంగా అంటే దగ్గరగా సి.డి.దేశ్ ముఖ్ గారితో కలిసి పనిచేసేటటువంటి అవకాశం వచ్చింది.ప్లానింగ్ కమిషన్ లో కూడా కేవలం ఒక సభ్యురాలిగా మాత్రమే కాకుండా సోషల్ వెల్ఫేర్ బోర్డు అనే ఒక సంస్థను ప్రత్యేకంగా ప్రారంభించి దాన్ని ప్లానింగ్ కమిషన్ కి అనుబంధంగా ఉంచి,దానికి అధ్యక్షురాలిగా దుర్గాబాయమ్మ గారిని చేశారు. ఆవిడ మద్రాస్ లో చేస్తున్న సాంఘిక సేవా కార్యక్రమాల్లాంటి వాటినే మరింత భారీఎత్తుగా చేయడానికి ఈ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఉపయోగపడింది. సోషల్ వెల్ఫేర్ బోర్డు తరఫున భారతదేశం అంతా కూడా ఈ స్త్రీ సంక్షేమ కార్యక్రమాల్ని ఆవిడ విస్తరించారు.

అక్కడ మద్రాసులో స్వంతంగా సంస్థలు నడుపుతూ,ఇక్కడ క్రిమినల్ లాయర్ గా పనిచేస్తూ సుప్రీం కోర్ట్ , మద్రాస్ లోనూ అలాగే ప్లానింగ్ కమిషన్ సభ్యురాలిగా పనిచేస్తూ. సోషల్ వెల్ఫేర్ బోర్డు అధ్యక్షురాలిగా పనులు నిర్వహిస్తూ .. ఇవన్నీ చేసింది.. ఒక్క మహిళ !

ఇలా జరుగుతున్న రోజుల్లో ఆవిడకి సి.డి.దేశ్ ముఖ్ గారు దగ్గరయ్యారు. ఆయన దుర్గాబాయమ్మ గారిని వివాహం చేసుకోవడం వరకు జరిగినటువంటి సంఘటల్ని చూసేముందు అసలు ఈ సి.డి.దేశ్ ముఖ్ గారు ఎవరు?ఆయన 1950 వచ్చేవరకు ఆయన ఎలా వున్నారు?ఆ విషయాలు చూద్దాం.

1950 కి ఆయన వయసు 58 సంవత్సరాలు.దుర్గాబాయమ్మ గారికి 41 సంవత్సరాలు.అంటే దాదాపుగా వాళ్ళిద్దరికీ 17 సంవత్సరాలు వయసులో వ్యత్యాసముంది. సి.డి.దేశ్ ముఖ్ గారి నేపథ్యమేమిటంటే, ఆయన 1892 లో పుట్టారు. చిన్నపట్నుంచి చదువులో చాలా చురుగ్గా ఉండేవాళ్ళు. 1919 లో ఐ.సి.యస్ రాయడానికి ఆయన లండన్ వెళ్లారు. అక్కడ ఆయనకీ ఒకటి, రెండు సంవత్సరాలు జూనియర్ సుభాష్ చంద్ర బోస్ గారు. భారతదేశానికి రావడానికి ముందు ఆయన లండన్ లోనే ఆంగ్ల యువతిని వివాహం చేసుకున్నారు. ఆవిడ పేరు రోజినా.అయితే ఇంటికొచ్చాక వాళ్ళది సాంప్రదాయ కుటుంబం కనుక వాళ్ళందరూ కూడా కొంత కినుక వహించారు గాని తర్వాత సరే వివాహం చేసికొని వచ్చాడు కదా అని వాళ్ళూ ఊరుకున్నారు. ఐ.సి.యస్.పాసై వచ్చాక గవర్నమెంట్ ఉద్యోగం కంటె రాజకీయంలో చురుకుగా పాల్గొందాం అనుకున్నారు. అప్పుడు బాల గంగాధర్ తిలక్ గారు చెప్పారు."చూడు దేశ్ ముఖ్ నీవు గనక ఈ రాజకీయాల్లో పాల్గొనడానికి మేము చాలా మందిమి ఉన్నాము. నీలాంటి వాళ్ళు ఈ గవర్నమెంట్ సర్వీస్ లో ఉండి అందులో ఉండేటటువంటి మెలకువలు , అందులో అనుభవం తెచ్చుకుంటే గనక మనకు స్వాతంత్ర్యం వచ్చాక నీ లాంటి అనుభవజ్ఞులు అవసరమౌతారు.అందుకని మనవాళ్ళు కొంతమంది ఐ.సి.యస్ లో కొనసాగితే బాగుంటుంది. నీకింత దేశభక్తి ఉంది కాబట్టి దాన్లో కొనసాగు" అని. ఆ సలహామీద సి.డి.దేశ్ ముఖ్ గారు ఐ.సి.యస్ ఆఫీసర్ గా చేరారు. భార్యతో భారతదేశమంతా ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడికి వెళ్ళటం ప్రారంభించారు. 1922 లో సి.డి.దేశ్ ముఖ్ గారు రోజినాతో కలిసి గుంటూరు దగ్గర అమరావతి లో ఉన్నారు. అక్కడ వాళ్ళకొక పాప పుట్టింది.ఆ పాపపేరు ప్రిమ్ రోజ్ అని పెట్టుకున్నారు. ఆ పాపని ఏడెనిమిది సంవత్సరాల వరకు వీళ్ళే చూసుకున్నారు. సి.డి.దేశ్ ముఖ్ గారి భార్య ఏమీ ఉద్యోగం చేసేవాళ్ళు కాదు. ఈయన మాత్రం ఉద్యోగం లో చాలా బిజీగా ఉంటూ ఉండేవాళ్ళు.పాపకూడా చదువు చెప్పించడానికి వేరే స్కూళ్లకు పంపించడానిక్కూడా ఇష్టం లేక ఇంటి దగ్గరనే చెప్తూ ఉండేవాళ్ళు. ఆతర్వాత ఆయన తన ఆత్మకథలో రాసుకున్నారు.నేను కొంచెం సరిగా చూడలేదేమో పాపని చిన్నప్పుడు ఇప్పుడు ఇంటికెళ్లినా కానీ నన్ను విసిగిస్తుంటే బెత్తంతో కొట్టేవాణ్ణి అని కూడా ఆయన చెప్పుకున్నారు. ఆ పాప కి ఏడెనిమిది సంవత్సరాల వయసొచ్చింది. అప్పటికి ఆయన మధ్యప్రదేశ్ లో పనిచేస్తున్నారు. ఆ రోజుల్లోనే వాళ్ళ భార్య యొక్క అక్క గారు, ప్రిమ్ రోజ్ అనేటటువంటి ఎనిమిది సంవత్సరాల పాపని తీసికెళ్ళి ఆవిడ లండన్ లో పెంచుకోవడం ప్రారంభించింది. రోజినా కూడా భారతదేశంలో ఎండలు , రకరకాల ప్రదేశాల్లోకి తిరగడం వీటన్నింటి తోటి కొంచెం అనారోగ్యం అనిపించి ఆవిడ కూడా లండన్ వెళ్లారు. ఇదంతా సుమారుగా 1940 ప్రాంతాల్లో.

సి.డి.దేశ్ ముఖ్ గారు కూడా ,ఒక ఐదారు సంవత్సరాల తర్వాత రిటైర్ అయిపోయి లండన్ వెళ్లిపోదామనుకున్నారు. లండన్లో పెరుగుతున్న పాపకి తల్లిదండ్రుల మీద అంతగా గౌరవాభిమానాలు పెరగలేదు. ఉత్తరాలు కూడా ఎక్కువగా రాస్తూ ఉండేది కాదట. దాంతోటి వాళ్ళ అమ్మగారికి కూడా చాలా బాధగా ఉండేది. లండన్ లో ఉండి కూతుర్నిదగ్గర చేసుకోవడానికి ఆవిడ ప్రయత్నించింది. సి.డి.దేశ్ ముఖ్ గారు కూడా 1949 ప్రాంతాల్లో ఇంకా రిటైర్మెంట్ తీసికొని లండన్ వెళ్ళిపోయి అక్కడ సెటిలవుదామని లండన్ లో ఇల్లు కూడా కొనుక్కున్నారు. దాదాపుగా ఆయన అన్నీ సర్దుకుని లండన్ వెళ్ళిపోదామని ఒక వారం రోజులుందనగా ఆయనకి లండన్ నుంచి కేబుల్ వచ్చింది – భార్య మరణించింది అని. దాంతోటి ఆయన ప్రణాళికలన్నీ తలకిందులైనవి. ఇప్పుడు ఒక్కడే వెళ్లి దూరంగా ఉన్నటువంటి కూతుర్ని దగ్గరికి తీసుకొచ్చి అక్కడ ఏంచేయగలను అని ఆలోచించారు.

ఆయన లండన్ వెళ్లడం విరమించుకున్నారు .వాళ్ళమ్మాయి మాత్రం వదిన గారి దగ్గరే పెరుగుతూ ఉంది. అప్పటికే ఆవిడకి 27 సంవత్సరాలో,30 సంవత్సరాలో వయసు కూడా వచ్చింది. పార్లమెంట్ లో ఆయన నెహ్రూగారి యొక్కమంత్రి వర్గంలో ఆయన ఫైనాన్స్ మినిస్టర్ గా చేరేటప్పటికి సి.డి.దేశ్ ముఖ్ గారి నేపథ్యం ఇది. కూతురు అక్కడుంటోంది, దూరంగా ఉంది.భార్య లేదు.ఆయనొక్కడే అమ్మగారు, వాళ్ళ సోదరీమణులు వాళ్ళ దగ్గర ఉంటున్నారు. ఆ సమయంలో ఆయన దుర్గాబాయమ్మ గారిని సన్నిహితంగా పరిశీలించడం జరిగింది.

అక్కడ్నుంచి దుర్గాబాయమ్మ గారిని వివాహం చేసుకునే వరకు ఎలాంటి పరిణామాలు జరిగినవి , వివాహం చేసుకున్నాక వాళ్ళిద్దరి యొక్క వైవాహిక జీవితం ఈ ప్రజాసేవా కార్యక్రమాలు ఎలా కొనసాగినవి వాటన్నిటినీ కూడా ఆవిడ ఎలా విస్తరించుకుంటూ వెళ్లారు , ఈ ఆంధ్ర మహిళాసభ ని

హైదరాబాద్ కి ఎలా తీసుకొచ్చారు ఆ డి.డి.కాలనీ ఎలా మొదలైంది , ఆ చివరి రోజులు ఎలా వున్నాయి ఇలాంటి విశేషాలన్నీ మనం వచ్చేవారం దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి జీవిత విశేషాలు చివరి భాగం, నాలుగవ వారంలో మాట్లాడుకుందాం......

**(ఆడియో టాక్ షో కి అక్షరరూపం ఇచ్చినవారు – శ్రీ బొడ్డు సత్యనారాయణ)**

(సశేషం)

2017 మార్చి 14 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS